ఏలూరు రేంజ్‌కు
100 మంది ఎస్‌ఐలు
ఈద్ ముబారక్
రంజాన్
ఉపవాస దీక్షలు ప్రారంభం
7

మద్యం దుకాణాలు మూసివేత

ఏలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి మద్యం దుకాణాలు మూతపడ్డాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 141 మద్యం దుకాణాలు, బార్లు, 152 కల్లు దుకాణాలు మూయించామని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు మద్యం అమ్మకాలు జరగకుండా డ్రై డే పాటించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఉత్తర్వులు డిస్టిలరీలు, మద్యం డిపోలు, ఇతర వాటికి కూడా వర్తిస్తాయన్నారు. అన్ని షాపులకు దగ్గరుండి సీళ్లను వేయించామని, ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని, వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

మూడంచెల భద్రత..

ఏలూరు క్రైం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు సందర్భంగా సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఎస్పీ కొమ్మి శివ ప్రతాప్ కిశోర్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు షిఫ్టులుగా ఈ బందోబస్తు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. మొత్తం 400 మందిని పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ఆరుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 45 మంది ఎస్‌ఐలు, 333 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను నియమించారు. షిఫ్టుకు 200 మంది వంతున విధులు నిర్వర్తించనున్నారు. మూడంచెల భద్రతా వలయంలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌యాక్టు 30, బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 (సీఆర్‌పీసీ 144) ప్రజా భద్రత దృష్ట్యా విధించారు. కౌంటింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాతో పాటు డ్రోన్ కెమెరాలతో కౌంటింగ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలను చేపట్టనున్నారు.

కౌంటింగ్..టైమ్!

నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు



సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు

- నిరవధికంగా కౌంటింగ్ ప్రక్రియ
- షిఫ్టుల వారీగా సిబ్బంది నియామకం
- ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ప్రాధాన్యతా ఓట్లను బట్టి ఫలితం
- 36 గంటలకు పైగా సమయం పట్టే అవకాశం

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభంకానుంది. ఈ మేరకు ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ జరుగుతున్న తీరును రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యవేక్షిస్తారు. అభ్యర్థుల పక్షాన ఏజెంట్లు సైతం కౌంటింగ్‌కు హాజరవుతారు. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కాస్త సుదీర్ఘంగానే కొనసాగబోతోంది.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పట్టభద్రుల నియోజకవర్గ ఓట్లను సోమవారం లెక్కించనున్నారు, గత నెల 27న పోలింగ్ జరగ్గా 2 లక్షల 18 వేల 902 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నిక లను అత్యంత ప్రతిష్టాత్మకంగా అధికార పక్షం భావిస్తోంది. పోలింగ్ సమయంలోనే సువ్వానేనా అనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో గత ఐదురోజులుగా పోటీ చేసిన 35 మంది అభ్యర్థులతో పాటు, వారి అనుచరులు ఫలితం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్టభద్రుల నియోజక వర్గంలో ప్రాధాన్యతా ఓటు ప్రకారం కొనసాగుతుంది. ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టం కావడంతో కౌంటింగ్ సిబ్బందికి తగినంత శిక్షణ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6.30 గంటలల్లోపే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకోవాల్సిందిగా సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్స్ సూపర్‌వైజర్లు, రోల్ ఇన్‌చార్జులు, పర్యవేక్షణాధికారులు తమ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో, కట్టలు కట్టడం, ఆ తర్వాత లెక్కించే సమయంలో ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి ఆదేశించారు. ఈ మేరకు జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి మార్గనిర్దేశం చేశారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

షిఫ్టుల వారీగా సిబ్బంది..

సాధారణ ఎన్నికల కంటే భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దాదాపు 2లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలను లెక్కించాల్సి ఉంది. అందుకే ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. తొలుత మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు కాని ఓట్లను గుర్తిస్తారు. ఇవి పోను, మిగిలిన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో ఏ అభ్యర్థికి దక్కాయో వరుసగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ యావత్తు కొనసాగడానికి కాస్త సమయం పడుతుంది. ఓట్ల లెక్కింపు నిరవధికంగా కొనసాగడానికి వీలుగా లెక్కింపు సిబ్బంది, అధికారులను షిఫ్టుల వారీగా నియమించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పోలైన 2లక్షల18వేల902 ఓట్లను ఒక కొలిక్కి తేవాలంటే ఒకరోజంతా పడుతుందని భావిస్తున్నారు. ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళా శాలలో జరిగే ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు.. 17 రౌండ్లుగా ఉండేటట్లు నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 35 మంది అభ్య ర్థులు పోటీ చేసినందున ఆ మేరకు మరింత అప్రమత్తం అయ్యారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ముందుగా చెల్లని ఓట్లను తొలగించడం, మిగతా ఓట్లను కట్టలుగా కట్టి టేబుల్‌కు వెయ్యి చొప్పున మొత్తం 28 టేబుళ్లకు కలిపి 28వేల వేల ఓట్లు లెక్కిం చడం ఆరంభిస్తారు. ఇలా 17 రౌండ్లు లెక్కింపు కొనసాగబోతుంది. రాత్రి పొద్దుపోయే సమయానికి కూడా ఈ ముందస్తు ప్రక్రియ ఒక్క కొలిక్కి రాగలదని, ఆ తర్వాతే అసలు సిసలైన ఓట్ల లెక్కింపు గాడినపడనుందని అంచనా వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆసాంతం పదేపదే సరిచూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న అధికారిక అంచనాల ప్రకారం లెక్కింపు ఒక కొలిక్కి వచ్చేసరికి దాదాపుగా 36 గంటలు దాటి సమయం పట్టే అవకాశం ఉంది.

- పోలైన ఓట్లు : 2 లక్షల18వేల 902
- మొత్తం టేబుళ్లు : 28
- మొత్తం రౌండ్లు : 17



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సర్వం సిద్ధం : కలెక్టర్

ఏలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు కౌంటింగ్‌కు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం కౌంటింగ్ ఏర్పాట్లను ఆమె అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం అవుతుందని, లెక్కింపు రెండు రోజులు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బందిని నియమించామని, 28 టేబుళ్లు, 17 రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. జేసీ ధాత్రి రెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రారావు పాల్గొన్నారు.



ఉప్పుటేరులోకి చేరిన సముద్రపు నీరు

చేపల సాగుకు ఉప్పునీటి గండం

- ఉప్పుటేరులోకి ముందే వచ్చిన సముద్రపు నీరు
- కొండంగి ఎత్తిపోతల నుంచి నీటి విడుదల నిలిపివేత

కలిదిండి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుటేరులోకి ముందస్తుగానే సముద్రపు నీరు రావడంతో కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరా నిలుపుదల చేశారు. దీంతో చేపల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో 36 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 23 వేల ఎకరాల్లో చేపల సాగు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు, 3 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఉప్పుటేరు పైనే ఆధారపడి చేపల సాగు చేస్తున్నారు. గతంలో మే నెల వరకు ఉప్పుటేరులోకి ఉప్పునీరు వచ్చేది కాదు. ఈ ఏడాది దాళ్వా పంట లేకపోవడంతో కాల్వలు కట్టేయడంతో తీపి నీరు దిగక మార్చి మొదటి వారంలోనే ముందస్తుగా ఉప్పునీరు వచ్చింది. దీంతో చేపల చెరువులకు నీరందించే కొండంగి ఎత్తిపోతల 1, 2, పథకాలను నిలుపుదల చేశారు. చెరువులకు నీరు తోడుకోవడానికి తీపి నీరు లేక ఆక్వా రైతులు పలు అవస్థలు పడుతున్నారు. తీపి నీటిలో మాత్రమే తెల్లచేపలు పెరుగుతాయి. ఉప్పునీరు తోడితే చెరువుల్లో చేపలు కళ్లు మండి చనిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో చేపల సాగు చేస్తున్న రైతులు ఉప్పునీరు ముందుగా రావడంతో చిన్న చేపలనే పట్టుబడి చేసి అయినకాడికి అమ్ముకుని నష్టాల పాలవుతున్నారు. ఆగస్టు వరకు ఉప్పుటేరులోని నీరు తీపి బడే అవకాశం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నగొల్లపాలెం వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తే ముందస్తు ఉప్పునీటి సమస్య పరిష్కారమవుతుందని లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తాయని ఆక్వా రైతులు పేర్కొంటున్నారు.



కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాల నుంచి నిలిచిన నీటి విడుదల

నేటి నుంచి దూరవిద్య ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నా యి. పలు అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ కొన్ని ఏఐ కేంద్రాల కో-ఆర్డినేటర్లు పరీక్షలను వాయిదా వేయాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం విదితమే. ఈ కేసుపై ఇప్పటికే కోర్టులో వాదనలు పూర్తికాగా తీర్పును రిజర్వ్ చేయడంతో పరీక్షల నిర్వహణపై కొంత డైలమా నెలకొంది. అయితే ఇంతవరకు కోర్టు నిర్ణయం వెలువడకపోవడంతో తొలుత నిర్ణయించిన షెడ్యూలు ప్రకారమే పరీక్షలను సోమవారం నుంచి యథాతథంగా జరపాలని విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. మొదటిసారిగా రెగ్యులర్ ఇంటర్ పరీక్షలతోపాటే 'ఓపెన్ స్కూల్స్' ఇంటర్ పరీక్షలను ఈ ఏడాది నిర్వహిస్తున్నారు. ఈనెల 15 వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు, నూజివీడులో మొత్తం 7 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 1004 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

స్క్వాడ్ బృందాలతో నిఘా

సార్వత్రిక ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు విద్యాశాఖ చెబుతోంది. జిల్లాలో పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు ప్రభుత్వం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని నియమించింది. పరీక్షలు జరిగే సమయంలో ఆకస్మిక తనిఖీల నిమిత్తం 4 సిట్టింగ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ముగ్గురు సభ్యులతో కూడిన జిల్లా పరీక్షల కమిటీ (డెక్)ని నియమించారు. ఆదివారం సాయంత్రం సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో విద్యాశాఖ ఉన్నతాధికారులు టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి పరీక్షల్లో ఎక్కడా అవకతవకలు జరగడానికి వీలులేదని, ఎవరి పైనా జాలి చూపించవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా మాల్ ప్రాక్టీస్, మాస్‌కాపీయింగ్ జరిగితే సంబంధిత పరీక్ష కేంద్రం సీఎస్, డీవో, ఇన్విజిలేటర్‌లను బాధ్యులుగా చేస్తామని హెచ్చరించారు.

పరీక్షల పారదర్శకతపై ఆరోపణలెన్నో..

కాగా సార్వత్రికవిద్య ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి అన్నీకలుపుకుని సుమారు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు/ విద్యార్థులు/ గృహిణులు/ ఇన్ సర్వీస్ ఉద్యోగుల అవసరాలను ఆసరాగా తీసుకుని ఓపెన్ పరీక్షల్లో 'పాస్ గ్యారెంటీ' ఆఫర్లను కొన్ని సెంటర్లలో ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లను మేనేజ్ చేసి పరీక్షల్లో ఖచ్చితంగా 'పాస్' చేయిస్తామంటూ కొందరు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు వసూళ్ళు చేస్తున్నట్టు సమాచారం. అభ్యర్థులకు సర్టిఫికెట్ అవసరం వున్నందున వారి బలహీనతలను పరిగణనలోకి తీసుకుని అడ్డగోలు వసూళ్ళకు పాల్పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.



అరకొరగా..!

- జిల్లాలో 43 శాతమే ఆస్తి పన్నుల వసూలు
- సిబ్బంది అలసత్వం



ఏలూరుటూటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ఆస్తి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. పన్ను వసూళ్లపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఆస్తి పన్నుల వసూళ్లలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి మునిసి పాలిటీలు, ఏలూరు నగర పాలక సంస్థ ఉన్నాయి. త్వరలో ఆర్థిక సంవత్సరం ముగిసిపోతున్నా ఇంతవరకు 50 శాతం కూడా పన్నులు వసూలు కాలేదు. దీనిబట్టి అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్లపై ఆసక్తి కనబరచడం లేదని అర్థమవుతోంది. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో ఫిబ్రవరి 20వ తేదీ వరకు 43 శాతమే పన్ను వసూలు చేశారు. ఇంకా 57 శాతం వసూలు చేయాలి.

- జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో 18,175 మంది ఆస్తిపన్నులు చెల్లించాల్సి ఉండగా వారి నుంచి 8 కోట్ల 45 లక్షల రూపాయలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూళ్ల డిమాండ్‌గా పాలక మండలి నిర్ణయించింది. ఇప్పటివరకు 5 కోట్ల 5 లక్షలు (60 శాతం) వసూలు చేశారు. ఇంకా రూ.3.4 కోట్లు (40 శాతం) వసూలు చేయాల్సి ఉంది. మిగిలిన మునిసిపాలిటీలతో పోలిస్తే జంగారెడ్డిగూడెం ఎక్కువగా వసూలు చేసింది.
- నూజివీడు మునిసిపాలిటీలో 14,905 అసెస్‌మెంట్స్ ఉండగా 8.21 కోట్ల రూపాయలు పన్ను వసూళ్ల టార్గెట్‌గా నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.3.95 కోట్లు (48 శాతం) మాత్రమే వసూలు కాగా ఇంకా రూ.4.26 కోట్లు (52శాతం) వసూలు చేయాల్సి ఉంది.
- చింతలపూడి మునిసిపాలిటీలో 7,261 మంది పన్ను చెల్లింపుదారులు ఉండగా రూ.కోటి 97 లక్షలు పన్ను వసూళ్ల లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు రూ.90 లక్షలు (45.4శాతం) వసూలు చేశారు. ఇంకా రూ. కోటి ఏడు లక్షలు (55 శాతం) వసూలు కావాల్సి ఉంది.
- ఏలూరు నగర పాలక సంస్థలో లక్షా 11 వేల 190 మంది పన్నులు చెల్లించాల్సి ఉండగా వీరి నుంచి రూ.60.53 కోట్లు డిమాండ్‌గా పాలక మండలి నిర్ణయించింది. ఇప్పటికి రూ.24 కోట్లు (40 శాతం) మాత్రమే వసూళ్లయ్యాయి. ఇంకా రూ.36.4 కోట్లు (60 శాతం) వసూళ్లు కావాలి. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల కంటే ఏలూరులో అతితక్కువగా వసూళ్లయ్యాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచే పెండింగ్..

ప్రధానంగా ఆస్తిపన్ను వసూళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు పన్ను చెల్లించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మునిసిపల్ అధికారులు కలెక్టర్ ద్వారా ఒత్తిడి తీసుకొస్తే ఎంతోకొంత చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. కోట్లాది రూపాయల ఆస్తిపన్నులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచే రావాల్సి ఉంది. ప్రైవేట్‌దారుల నుంచి ఆస్తిపన్ను వసూళ్లలో కొంతపురోగతి కనిపిస్తోంది. వీటికి తోడు డబుల్ అసెస్‌మెంట్‌లు ఎక్కువగానే ఉన్నాయి. పొరపాటున ఒక పన్ను చెల్లింపుదారుని పేరు రికార్డుల్లో రెండుసార్లు నమోదు కావడంతో ఆ వ్యక్తి పన్నులు కట్టినప్పటికి మళ్లీ అతను పన్ను కట్టని వారిగానే రికార్డులు చూపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఆస్తిపన్ను చెల్లించకుండా చివరకు మాకు పన్నులు ఎక్కువేస్తున్నారంటూ చాలామంది కోర్టులకు వెళ్లడంతో ఏళ్ల తరబడి సమయం పడుతోంది. మరికొంత మంది ప్రజాప్రతినిధుల జోక్యంతో పన్నులు చెల్లింపు చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీస్థలాల యజమానుల నుంచి 6.41 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉండగా రూ.1.61 కోట్లు మాత్రమే వసూలు కాగా ఇంకా రూ.4.8 కోట్లు వసూలు కావాల్సి ఉంది. తాగునీటి పన్నులు వసూలు కూడా అంతంతమాత్రంగానే ఉంది. మొత్తం రూ.23.27 కోట్లు డిమాండ్‌గా ఉండగా రూ.5.42 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మిగిలిన స్వల్ప వ్యవధిలో ఎంతవరకు ఆస్తిపన్ను వసూలు చేస్తారో వేచి చూడాలి.

పెద్దింటమ్మకు భక్తుల తాకిడి

కైకలూరు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి ఉత్సవాల రెండోవ రోజు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం నుంచి కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు చలువ పందిళ్లలో పాలపొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పరమేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, భక్తులకు ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నానికి చెందిన సయ్యపురాజు గుర్రాజు, జానకి దంపతులు, రుద్రరాజు సుబ్రహ్మణ్యరాజు, వాసవి శైలజ దుర్గాంబిక దంపతులు అందజేశారు. ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో చిన్న పిల్లలకు పాలు, భక్తులకు మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. రూరల్ ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.







అమ్మవారికి పూజలు.. దర్శించుకుంటున్న భక్తులు .. పాలపొంగలి నైవేద్యంగా తీసుకువెళుతున్న భక్తురాలు



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మత్స్యకార సంఘ సభ్యులు

మత్స్యరంగ అభివృద్ధికి చర్యలు తీసుకోండి

భీమవరం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్యకారుల సంక్షేమంతో పాటు మత్స్యరంగ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదేశించారు. బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస వర్మను నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మైల వసంత రావు, పాలకవర్గం సభ్యులు కలిశారు. జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంత మార్కెట్లు, ఫిష్ మార్కెట్లలో వసతులు కల్పించడం, పంచాయతీరాజ్ చెరువుల వేలంలో 10 శాతం పరిమితి దాటకుండా చర్యలు తీసుకోవాలని, వలలు, నావలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని ఎస్టీ, ఎస్సీ, బీసీలకు 75 శాతం పెంచాలని, మత్స్యకార సొసైటీ గ్రామాల్లో మత్స్యకార కమ్యూనిటీ హాల్, మత్స్యకారుల వాహనాలు ఇచ్చే రాయితీ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి జిల్లా మత్స్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. మత్స్యకారుల సమస్యల పరి ష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైస్ ప్రెసిడెంట్ రాజా బాలాజీ, డైరెక్టర్లు వూడిమూడి శ్రీనివాస్, బేరం శ్రీరామ చంద్రమూర్తి, బెజవాడ నాగరాజు, తిరుమాణి సీతామాలక్ష్మి, మోకా ఆంజనేయులు, జంపా అప్పారావు, కోపనాతి శ్రీనివాసరావు, పిడిగే జోసెఫ్, వైదాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళలాడిన చిన వెంకన్న క్షేత్రం



ద్వారకాతిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గోవిందుని నామాలతో ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం మారుమోగింది. సెలవుదినం కావడంతో ఆదివారం అధిక సంఖ్యలో భక్తజనులు చిన వెంకన్న ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసా దాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్న దానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 12 వేల మంది వరకూ స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం వారంతా వకుళ మాత అన్న ప్రసాద భవనానికి చేరుకుని ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బుట్టాయగూడెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మన్యం ఆరాధ్యదైవం గుబ్బల మంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజామునుంచే అమ్మవారిని దర్శిం చుకోడానికి బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆల భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



జాతీయ స్థాయి టి-20 కి 16 మంది ఎంపిక

భీమవరం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బధిర (మూగ చెముడు) 7వ జాతీయ టీ-20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపికయ్యారని జిల్లా బధిర క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ తాతారావు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన 16 మంది బధిర క్రీడాకారులు వచ్చేనెల 16 నుంచి 19 వరకు హర్యానా కాచపూర్ గురుగావ్‌లో బధిర క్రికెట్ టి-20 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం భీమవరం వెంకట్రామ థియేటర్‌లో వివరాలను తెలిపారు. ఇటీవల భీమవరం డీఎన్నార్ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి టి-20 క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుల్లో 16 మంది జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.ఆర్గ నైజింగ్ వైస్ ఛైర్మన్ రాము, కోశాధికారి రామ చంద్రరావు, బిహెచ్ రవికుమార్ రాజు పాల్గొన్నారు.

పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తణుకు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు అండగా ఉండాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెప్పారు. పశువుకు తీవ్రమైన జ్వరం, నీరసం, కాలిగిట్టల మధ్య పుండ్లు, చూడి పశువులు ఈసుకుపోవడం వంటి లక్షణాలు గాలి గుంటు వ్యాధి కిందకు వస్తాయి. ఇది ఒక పశువు నుంచి మరో పశువుకు సంక్రమించే అవకాశం ఉండటంతో రైతులు ఆర్థికంగా నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. టీకాలు వేయడం వల్ల వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చు. దూడల్లో మర ణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి దోహదపడుతుంది. ప్రభుత్వం అందించే టీకాలు వేయించడం ద్వారానే బ్రూసెల్లో వ్యాధి నివారించవచ్చును.మూడు నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు తప్పని సరిగా టీకాలు వేయించాల్సి ఉంది. నాలుగు నుంచి ఎనిమిది నెలలు వయసు గల పెయ్యి దూడలకు బ్రూసెల్లోస్ టీకాలు వేయించాలి.



రంజాన్ మాసం వచ్చేసింది. ఈ 30 రోజులూ ముస్లింలకు పండగే. ఈ నెలంతా ఉపవాస దీక్షలతో అల్లాను భక్తితో ఆరాధిస్తారు. రంజాన్ నెలను ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మసీదుల్లో ప్రార్థనలు చేస్తారు. ముస్లింల జీవన విధానంలో ఈ నెల రోజులు చాలా మార్పు కనిపిస్తుంది. మసీదులన్నీ రంజాన్ కోసం ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో అలంకరించుకున్నాయి. మార్కెట్లకు రంజాన్ కళ వచ్చింది.

ఈద్ ముబారక్

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

గణపవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దైవప్రవక్త హజరత్ మహ్మద్ సంవత్సరంలో 12 మాసాల్లో ఒక మాసం సానుభూతి చూపాలని ఆదేశించారు. అప్పటి నుంచి పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడతారు.రంజాన్ నెలరోజులు ఏ మసీదు చూసిన ముస్లిం ప్రార్థనలతో నిండి ఉంటుంది. నెల రోజుల ఉపవాస దీక్ష కూడా ప్రత్యేకంగా ఉంటుంది. ఆహారం తీసుకునే పద్ధతుల్లో, నియమాల్లో మార్పు ఉంటుంది. సూర్యోదయానికి ముందే ఆహారం తీసుకుంటారు. సాయంత్రం సూర్యాస్తమయం తరువాతే మళ్లీ ఆహారం. అంటే ఒక పూట ఉపవాసం ఉంటారు. ఈ ఉపవాసం కూడా చాలా దీక్షగా చేస్తారు. కనీసం నీటిని కూడా తీసుకోరు. ఎక్కువగా డ్రైఫ్రూట్స్‌నే ఆహారంగా తీసుకుంటారు. ఈ నెలంతా సేమియాకు కూడా మంచి డిమాండ్ ఉంటుంది. ఏ ముస్లిం గృహానికి వెళ్లిన సేమియా రుచి చూడాల్సిందే. అంతేకాదు.. హిందువులు, ముస్లింలు ఒకరినొకరు ఇళ్లకు ఆహ్వానించి ఇఫ్తార్ విందు ఇవ్వడం అనవాయితీగా వస్తున్నది. ఇది హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

పేదలకు ధానధర్మాలు

ఈద్ - ఉల్ - ఫితర్ అంటే ధానధర్మాల పండుగ అని అర్థం. చివరి ఉపవాసం రోజున నెలవంక చూసిన మరుసటి రోజు ఈద్ నమాజ్‌కు ముందే ముస్లిం ఫిత్రా చెల్లిస్తారు. ధనిక, పేద, చిన్న తేడా లేకుండా కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంత మంది పక్షాన ఫిత్రా చెల్లించాలి. స్థితిమంతులు తాము సంపాదించిన దానిలో తోచినంత బీదవారికి దానం ఇవ్వడం వలన అల్లా ఆశీస్సులతో శుభ సంతోషాలు లభిస్తాయని నమ్మకం. కొంతమంది ముస్లింలు అయితే ప్రతీ ఏడాది కొంతమొత్తం పేదలకు దానం చేస్తారు. మసీదుకు వెళ్లినప్పుడు ఒకదారి, తిరిగి వచ్చేటప్పుడు మరో దారిలో రావడం ఉత్తమంగా భావిస్తారు. నమాజ్ ముగిసిన తరువాత గురువు ఉపదేశం ఇస్తారు.

ప్రతీరోజు 5 పూటలా నమాజు



సమాజ శాంతికి ఇస్లాం విధిగా నిర్ణయించిన ఆరాధన విధా నాల్లో మొట్టమొదటిది నమాజ్. ఈ రంజాన్ పండుగ నెల రోజు ల్లోనూ ప్రతీ రోజు ఐదుపూటలా నమాజ్ ఆచరిస్తాం. ఈ మాసంలో నియమనిష్టలతో ఉంటే జీవితానికి పరిపూర్ణత లభిస్తుంది.

- అరమాన్ రజాక్ ఖదారి, మసీదు పెదగురువు, గణపవరం

30 రోజులు ఉపవాస దీక్ష



రంజాన్ నెలరోజులు భక్తిశ్రద్ధలతో ఉంటాం. ప్రతీ ఒక్కరు 30 రోజులపాటు దీక్ష పాటించాలి. కుటుంబసభ్యులు మనిషికి ఒకటి చొప్పున రెండున్నర కిలోల గోధుమలు లేదా వాటి విలువ సొమ్మును ఫిత్రాగా ఇవ్వాలి. ఇతరుల బాధలు తీర్చడం కోసమే ధానధర్మాలు చేయాలి.

-ఎండీ గఫూర్, గణపవరం



విద్యుత్ దీపాలతో అలంకరించిన పాలకొల్లు మెయిన్ రోడ్డులోని మసీదు

శుభాల సరోవరం

పాలకొల్లు అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముస్లిములు చాంద్రమాన క్యాలెండర్‌ను అనుసరిస్తారు. దీని ప్రకారం రంజాన్ 9వ మాసం నెలవంక దర్శనం అనంతరం ప్రారంభం అవుతుంది. ఈ నెలలో ప్రతీ రోజూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ముస్లీంలు ఉపవాస దీక్షలో ఉంటారు. దీనిని రోజా అని పిలుస్తారు. ఉపవాస దీక్షను మూడు భాగాలుగా విభజిస్తారు. తొలి 10 రోజులు ఉపవాస కాలాన్ని రహ్మత్ అని, తరువాత వచ్చే 10 దినాలను బర్కత్ అని చివరి దినాలను మగ్ఫిరత్ అని పిలుస్తారు. ఉపవాస దీక్షలు ముగింపు రోజున నెల వంక దర్శనం అనంతరం రంజాన్ పండుగ జరుపుకుంటారు. ముస్లింల మతగ్రంథం ఖురాన్ ఈ మాసం లోనే అవిర్భవించిదని ముస్లం పెద్దలు చెబుతున్నారు. శని వారం రాత్రి పట్టణంలోని మసీదులో జరిగిన కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మాట్లాడుతూ శుభాల సరోవరం, వరాల వసంతం రంజాన్ మాసం అని తెలిపారు. ఈ మాసంలో ఒక ఉపవాసం ఉంటే 70 ఉపవాసాలతో సమానమన్నారు. అలాగే తరావీహ్ అనే ప్రత్యేక ప్రార్థన చేస్తారని, ఈ మాసంలో ఒక పుణ్య కార్యం చేస్తే 70 పుణ్యాలు చేసిన ఫలం లభిస్తుందని తెలిపారు.



పెంటపాడులో కూరగాయల దుకాణం

దిగిరాని కూరగాయల ధరలు

పెంటపాడు/ ఏలూరు కార్పొరేషన్ మార్చి 2(ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు దిగి రాలేదు. కొన్ని వారాల నుంచి కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. కొన్ని కూరగాయలు పెరుగుతున్నాయి. టమాటా ధర తగ్గింది. బీన్స్, కాప్సికం, చిక్కుడు ధరలు మాత్రం ఆకాశాన్ని తాకాయి. ఆదివారం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. బీరకాయ కేజీ 50, దొండకాయ కేజీ రూ.40, బెండకాయ రూ.40, తెల్ల వంకాయిలు కేజీ రూ.40, నల్ల వంకాయిలు కేజీ రూ.40, అల్లం కేజీ రూ.60, మునక్కాయలు కాయ ఒకటి రూ.15, ఆనపకాయ ఒక్కటి రూ.15, దోసకాయ కేజీ రూ.40, అరిటి కాయలు 3 రూ. 20 , క్యారెట్ రూ.40, బీట్‌రూట్ రూ.40, టమాటో కేజీ రూ 20 , బీన్స్ కేజీ రూ.80 , కాప్సికం రూ.80, చిక్కుడు కేజీ రూ.80, పచ్చి మిర్చి కేజీ రూ.40, కొత్తిమీర కేజీ రూ.60 , కట్ట ఒకటి రూ.20, ఉల్లిపా యలు నాణ్యత ఆధారంగా కిలో రూ.30 నుంచి రూ.40 వరకు అమ్ము తున్నారు. కూరగాయల ధరలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ జరపడంతో రైతుబజార్లలో ధరలు అందుబాటులోకి వచ్చాయి. ఏలూరు రైతు బజార్లలో ధరలు ఇలా ఉన్నాయి.. కిలో టమోటా రూ. 16, వంకా యలు రూ. 24, బెండ రూ. 36, మిర్చి రూ. 28, బీర రూ. 32, క్యాబేజి రూ.16, క్యాలీఫ్లవర్ 30, క్యారెట్ రూ. 34, దొండ రూ.38, గోరుచిక్కుడు రూ. 40, చిక్కుడు రూ. 60, దోస రూ. 20, బీట్‌రూట్ రూ.34, అల్లం రూ. 60, క్యాప్సికం రూ. 56, సొరకాయ రూ. 25, అరటికాయ ఒక్కటి రూ. 6, గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతుకూర కట్ట రూ. 10 చొప్పున అమ్మకాలు జరుపుతున్నారు.


5 కిలోల మారేడు కాయ



పాలకొల్లు అర్బన్, 3 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణంలోని చిన్నగోపురం వీధిలో గల బంగారు శిరీష, మురళీధర్ ఇంటి పెరడులో ఉన్న మారేడు చెట్టుకు 5 కిలోల బరువు గల కాయ కాసింది. 2007లో కడియం నుంచి తీసుకువచ్చి ఉసిరి, మారేడు మొక్కలు తమ ఇంటి పెరడులో నాటినట్టు శిరీష తెలిపారు. గతంలో ఎన్నడూ ఇంత పెద్దకాయ కాయలేద న్నారు. ఇది తెలిసిన చాలామంది వచ్చి చూసి ఇది మహాశివుడి మహత్యం అని నమస్కరించి వెళుతున్నారు.

వన్యప్రాణులకు ఆలవాలం పాపికొండల అభయారణ్యం

నేడు ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం





అభయారణ్యంలో చిరుత, జింక

పోలవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో ప్రతి ప్రాణికి తమ స్వేచ్ఛా ప్రపంచంలో నిర్భయంగా బతికే హక్కు ఉంది. కానీ మానవుడు తన తన స్వార్థం కోసం అడవులపై పడి వనాలను తగులబెట్టి, వన్యప్రాణులను వేటాడడం వంటి అకృత్యా లకు పాల్పడి జీవ వైవిధ్యం మనుగడకు ముప్పు తెస్తున్నాడు.అడవులు అంతరించి అడవుల్లో జీవించే వన్యప్రాణులు జనారణ్యాల లోకి వచ్చి మృత్యువు పాలవుతున్నాయి.ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా వన్య ప్రాణుల సంరక్షణ గురించి మన ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంచారం గురించి తెలుసుకుందాం. ఐక్యరాజ్య సమితి వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం ప్రతి ఏటా మార్చి 3 జరుపుకోవడానికి నిర్ణయించింది. అంతరించిపోతున్న అడవి జంతుజాలం, వృక్షజాలం జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకోవడమే గాక అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల సమీపాల్లో ఉన్న గ్రామాల్లో వేట వృత్తిగా జీవిచే గిరిజనులకు వన్యప్రాణుల సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పోలవరం నుండి జీలుగుమిల్లి వరకూ అక్కడి నుండి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వరకూ అరణ్యాలు విస్తరించి ఉన్నాయి. ఏలూరు జిల్లా కృష్ణా జిల్లాల పరిధిలో 673 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొల్లేరు పక్షుల సంరక్షణ కేంద్రం ఉంది. తడికలపూడి అడవులు, నల్లజర్ల అడవుల్లో సైతం వన్యప్రాణుల కదలికలు ఉన్నాయి. పోలవరం నుంచి గోదావరి ఎగువన నదీ పరివాహక ప్రాంతానికి ఇరువైపులా ఖమ్మం జిల్లా వరకూ అడవులు విస్తరించి ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు కోసం గిరిజన గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించడంతో పాపికొండల అభయా రణ్యంలో వన్య ప్రాణుల సంచారం పెరిగింది. గతంలో కంటే పాపికొండల అభయారణ్యంలో వన్య ప్రాణుల సంతతి గణనీయంగా పెరిగిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పాపికొండల అభయారణ్యంలో గొర్రెగేదెలు, నెమళ్ళు, జింకలు, చిరుతలు, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, కుందేళ్ళు, నక్కలు, మొసళ్ళు, పులులు,అడవిపందులు, పాములు ఇతర జంతుజాలం గతంలో కంటే పెరిగింది. మైదాన ప్రాంతాల నుంచి గొర్రెల కాపరులు పాపి కొండల అభయారణ్యాలలోకి తమ గొర్రెల మందలను మేపడానికి వెళ్లడం వల్ల, అడవులను తగులబెట్టడం, పాపికొండల టూరిజం బోట్లలో డీజే మైక్ సౌండ్‌లు వినియోగించడం వల్ల వాటి స్వేచ్ఛకు భంగం కలిగి ప్రాణభయంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. గతంలో అడవుల నుండి తప్పిపోయి వచ్చిన గొర్రెగేదె దాడిలో పోలవరం మండలం ఎల్లండీపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు మృతి చెందింది. ఈ వేసవిలో నీటి కోసం వచ్చే వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతాల్లో పలుచోట్ల నీటి కుంటలు, చెక్‌డ్యాంలలో నీటి నిల్వలు ఉంచడం ద్వారా వన్యప్రాణులు నీటి కోసం జనావాసాల్లోకి వచ్చే అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలి.

రాజమహేంద్రవరంలో ప్రధాన కేంద్రం

అటవీక్షేత్రాధికారి ఎస్‌కె వలీ, పోలవరం

పాపికొండల అభయారణ్యం పోలవరం రేంజ్ 9 వేల హెక్టార్లలో విస్తీర్ణంలో విస్తరించి ఉంది. తూర్పు గోదావరి జిల్లా, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రంపచోడవరం, కుక్కునూరు వేలేరుపాడు మండలాల పరిధిలో ఉన్న అరణ్యాలను 7 రేంజ్‌లుగా విభజించారు. 7 రేంజ్‌లను కలిపి రాజమహేంద్రవరంలో ప్రధాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడు రేంజ్‌ల పరిధిలో వన్యప్రాణులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ఆ కేంద్రం ద్వారా వన్యప్రాణులకు వైద్యసేవలు, సంరక్షణ, సంతతి అభివృద్ధి కార్యక్రమాలు అందించబడతాయి.



కాలువలోకి దూసుకు వెళ్లిన రొయ్యల లారీ

కాళ్ళ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కాళ్ళలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకోవడం వల్ల రొయ్యలతో వెళ్తున్న కంటైనర్ లారీ ప్రమాదవశాత్తు రుద్రాయకోడు మురుగు కాలువలోకి దూసుకెళ్లింది. స్థానిక రైతులు, గ్రామస్తులు వెంటనే క్రేన్ల సహాయంతో లారీని పైకి తీసుకువచ్చారు. కంటైనర్ సీజ్ చేసి ఉండటంతో రొయ్యలు లారీలోనే సురక్షితంగా ఉన్నాయని రైతులు చెప్పారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదన్నారు.



ధ్వంసమైన కారు ముందుభాగం

ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఐదుగురికి గాయాలు

దెందులూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దెందులూరు హైవే వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుం బానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. సమయానికి కారులో బెలూన్ ఓపెన్ కావడంతో గాయాలతో బయటపడ్డారు. ఇందులో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీ పంలో నివాసం ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబం ఐదుగురు శనివారం పిడుగురాళ్లకు వివాహానికి వెళ్లి ఆదివారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా దెందులూరు పెట్రోల్ బంకు దాటి గుండేరు వాగు సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు బలంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణకు అతని అమ్మమ్మ అనంతలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఒకటవ పట్టణం గునుపూడికి చెందిన వి. వెంకట సుబ్రహ్మణ్యం (54) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. వెంకట సుబ్రహ్మణ్యం ఫిబ్రవరి 19న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కిందకు పడిపోగా గాయపడ్డారు. మెరుగైన చికిత్సకు మంగళగిరిలోని ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారన్నారు. ఏఎస్ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం

ఉండి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఉండి నుంచి ఉప్పుగుంటకు వెళ్లే పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం వుందని ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. ఉండి గ్రామం నుంచి ఉప్పుగుంటకు వెళ్లే పంటకాలువలో లేత పసుపురంగు టీషర్టు, బ్లూరంగు జీన్ ఫ్యాంటు వేసుకుని వున్న సమారు 35 నుంచి 40 సంవత్సరాల గల గుర్తు తెలియని మృతదేహం వుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96648 నంబరును సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

ఆగిరిపల్లి, మార్చి 2 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని అమ్మవారిగూ డెం వద్ద ఆటో బోల్తాపడి యువకుడు మృతిచెందాడు. ఆగిరిపల్లికి చెందిన కూరపాటి నాని (31) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆగిరిపల్లి నుంచి బండారుగూడెంకి ఆటోలో గోనెసంచులు లోడుతో వెళుతుండగా అమ్మవారిగూడెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నానికి తలకి బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. యువ కుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.





ఎస్ఐ నియామకపు ఉత్తర్వులను అందిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్.. పాల్గొన్న నూతన ఎస్ఐలు

ఏలూరు రేంజ్‌కు 100 మంది ఎస్ఐలు

నియామక ఉత్తర్వులు అందజేసిన ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని, ముద్దాయిలకు శిక్ష పడేలా పనిచేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్ అన్నారు. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వంద మంది 2024 బ్యాచ్ ఎస్ఐలు ఏలూరు రేంజ్‌నకు వచ్చారు. వీరిలో 68 మంది పురుషులు, 32 మంది మహిళలు ఉన్నారు. వీరికి ఏలూరు ఐజీ కార్యాలయంలో ఎస్ఐ నియామక ఉత్తర్వులను అందించారు. ఐజీ మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ పోలీస్‌శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏలూరు రేంజ్ పరిధిలో అల్లూరి సీతారామ రాజు జిల్లాకు నలుగురు, కాకినాడ జిల్లాకు ఇద్దరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఒకరు, తూర్పు గోదావరి జిల్లాకు 15, పశ్చిమ గోదావరి జిల్లాకు ఒకరు, ఏలూరు జిల్లాకు ఒకరు, కృష్ణాజిల్లాకు 20 మంది, ఎన్టీఆర్ జిల్లా 56 మందిని ఆయా జిల్లాలకు కేటాయిస్తూ నియామకపు ఉత్తర్వులను అందించి అభినందించారు.

నేడు గంగానమ్మ, పోతురాజు బాబు విగ్రహాల ప్రతిష్ఠ

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుబాబు, మద్దిరావమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గోపూజ, అభిషేకం, నిత్యపూజ, చండీహోమం, ఆదివాసాలు, బలిహరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి అమ్మవారిని పోతురాజుబాబు, మద్దిరావమ్మ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. 3వ తేదీన విగ్రహ ప్రతిష్ఠమహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి'

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి సానుభూతిపరులు తరలివస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, ఎన్.జ్యోతి కుమార్, తేజశ్విని, నగిరెడ్డి కాశీనరేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచే యోచన విరమించుకోండి

టి.నరసాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచే యోచన విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీఎస్ రాజు అన్నారు. బొర్రంపాలెంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడం తగదు అన్నారు. గ్రామాల్లో పంటలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చిలోనే విద్యుత్ కోతలు మొదలయ్యాయన్నారు. మే నెల వస్తే పరిస్థితి ఏమిటని సందేహం వ్యక్తం చేశారు.

5న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన ధర్నా చేపట్టారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సంఘ నాయకులు కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, రెడ్డి శ్రీనివాసడాంగే, పుప్పాల కన్నబాబులు ఆదివారం పిలుపునిచ్చారు. ఈ మేరకు అన్నేభవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో చర్చలు జరిపి 5న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీఆర్వోలకు క్లస్టర్ల కేటాయింపుపై అభ్యంతరం

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో తాజాగా 2,3 సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా విభజించి వీఆర్వోను కేటాయించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఒక సచివాలయం పర్యవేక్షణే వీఆర్వోలకు కష్టమైతే ఇప్పుడు క్లస్టర్‌లో ఉన్న రెండు, మూడు సచివాలయాలను చూసుకోవడం మరింత భారం అవుతుందని అన్నారు. ఈ భారం కారణంగా రెవెన్యూ సేవలు కుంటుపడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికే సమయంతో సంబంధం లేకుండా వీఆర్వోలు పని ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లస్టర్ విధానం వల్ల వీఆర్వోలు పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ పేరుతో గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అసంబద్ధ నిర్ణయాలతో కష్టాలపాలు చేస్తోందని అన్నారు.

ట్రెజరీ అకౌంట్స్ సర్వీసెస్ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ట్రెజరీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని నూతన ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దాసరి కృష్ణంరాజు పేర్కొన్నారు. ఆదివారం ఏలూరు ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో ట్రెజరీ అకౌంట్స్, సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా దాసరి కృష్ణంరాజు, కార్యదర్శిగా మహేష్‌బాబు, సహ అధ్యక్షురాలిగా టి.మాధవి, ఉపాధ్యక్షులుగా ప్రేమావతి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.జె.లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.శిరీష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎస్.చిన్నబాబు, ఎన్.సాయికృష్ణ, కె.రత్న కుమారి, ట్రెజరర్‌గా నరేంద్రబాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ హసీనాబేగం వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణంరాజు మాట్లాడుతూ సిబ్బంది పదోన్నతుల విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. కార్యవర్గ సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందించి సిబ్బంది అభినందించారు.

ఫిజీషియన్స్ జాతీయ అధ్యక్షుడిగా శివమూర్తి

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ జాతీయ అధ్యక్షుడిగా ఏలూరుకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు కె.ఎస్.ఎస్. శివమూర్తి ఎన్నికయ్యారు. ఇటీవల పూణెలో 27వ జాతీయ హోమియో వైద్యుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయనను జాతీయ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఏలూరులోని రత్నేశ్వర హోమియోపతి వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ శివమూర్తి మాట్లాడుతూ రెండేళ్ల పాటు జాతీయ అధ్యక్షుడిగా పదవిలో కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని హోమియో వైద్యులు డాక్టర్ శివమూర్తిని శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వి.కె.పంకజాక్షన్, డాక్టర్ పి.గోపీనాథ్, జిల్లా అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తండ్రి చెంతకు

బుట్టాయగూడెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : బుట్టాయగూడెంలో తప్పిపోయిన బాలుడిని పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు తండ్రికి క్షేమంగా అందజేశారు. పొగాకు పనుల నిమిత్తం తెలంగాణ రాష్ట్రం ఆశ్వారావుపేట మండలం చన్నాపురానికి చెందిన కట్టం నవీన్ ఐదేళ్ల కుమారుడితో వచ్చాడు. ఐదు నెలలు క్రితం భార్యభర్తల మధ్య గొడవలు రావడంతో ఇద్దరు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. నవీన్ కుమారుడైన మహేంద్రవర్మను నవీన్ తనవద్దే ఉంచుకున్నాడు. అందరి పిల్లలతో పాటు నవీన్ కూడా మహేంద్రవర్మను బ్యారన్ల వద్దే వదలి ఆదివారం పనులకు వెళ్లాడు. ఆడుకుంటూ మహేంద్రవర్మ బుట్టాయగూడెం సెంటర్‌కు చేరుకోగా వామిశెట్టి వెంకటేశ్వరావు గుర్తించి ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశాడు.. బాలుడిని గుర్తించిన మేనమామ బుట్టాయగూడెం వచ్చి తండ్రి నవీన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఝాన్సీ సమక్షంలో బాలుడిని తండ్రి నవీన్‌కు అప్పగించాడు.

'పేదల అభ్యున్నతికి లయన్స్ విశేష కృషి'

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : లయన్స్ జిల్లా రీజియన్ సమావేశం ఛైర్ పర్సన్ ఎం.కృష్ణమోహన్ అధ్యక్షతన ఆదివారం ఏలూరు న్యూ అశోక్ నగర్‌లోని లయన్స్ మల్టీ సర్వీసెస్ సెంటర్లో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి లయన్స్ అంతర్జాతీయ సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా సేవా మహోత్సవం నిర్వహించి పేదలకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు, విద్యార్థులకు సైకిళ్లు అందచేశారు. జిల్లా గవర్నర్ కె.వేణుబాబు మాట్లాడుతూ సేవా భావంతో పేదలకు సేవలందించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ బాబు, కె.కిషోర్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీహరి, వి.కోటేశ్వరరావు, కె.రాజేంద్ర వరప్రసాద్ పాల్గొన్నారు.

అమరవరం అటవీరేంజ్‌లో స్క్వాడ్ తనిఖీలు

కుక్కునూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : అమరవరం అటవీరేంజ్‌లో జామాయిల్ చెట్లను అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరానికి చెందిన స్క్వాడ్ బృందం ఆదివారం తనిఖీలు చేపట్టింది. బర్లమడుగులో అటవీ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 20ఏళ్లుగా జామాయిల్ సాగు జరుగుతోంది. ఇందులో అక్రమంగా జామాయిల్ చెట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్క్వాడ్ బృందం తనిఖీ చేపట్టగా 40కి పైగా జామాయిల్ చెట్లు నరికి వేసినట్లు గుర్తించారు. నరికేసిన జామాయిల్ చెట్ల విలువను అంచనా వేస్తున్నారు. స్క్వాడ్ బృందంతో పాటు స్థానిక అటవీ సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

వీరేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే రోషన్ కుమార్

ఏలూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో కొలువైన శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఉప్పునూతల పుల్లారావు, ఆలయ ప్రధాన అర్చకులు కాళ్లకూరి రవికుమార్ శర్మ ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవ కమిటీ తరుపున ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ ముత్తా రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖ, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, కొడవటి సత్తిరాజు, పిన్నమనేని నాని, ఎస్ఎస్. ఇస్మాయిల్, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, ముళ్ళపూడి శ్రీను, సర్పంచ్ యరమళ్ళ సత్యవతి, కొడవటి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమన్యాయం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రాష్ట్ర పునఃనిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు అద్దంపడుతున్నాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీల అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతోందన్నారు. సాధారణ ప్రజల ఆర్థిక భద్రతే లక్ష్యంగా బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు.

ఇండోర్ స్టేడియానికి మోక్షమెప్పుడో?



అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం భవనం

ఉంగుటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలో గత టి.డి.పి. ప్రభుత్వం ఎస్.ఏ.ఎఫ్. నిధులు రూ.కోటిన్నరతో నారాయణపురం డిగ్రీ జూనియర్ కళాశాలల ప్రాంగణంలో ప్రారంభించిన ఇండోర్ స్టేడియం నిర్మాణం అర్ధంతరంగా మిగిలిపోయింది. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న గన్ని వీరాంజనేయులు చొరవతో ఈ నిర్మాణం ప్రారంభమైనా మూడొంతుల వరకే పని జరిగింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం రావడంతో నిధులు కేటాయించక అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. ప్రధానంగా ఇక్కడ యువత షటిల్ బ్యాడ్మింటన్ వంటి ఆటలపై పట్టు ఉన్న వారంతా ప్రజా ప్రతినిధులయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తరుణంలో ఈ ఇండోర్ స్టేడియానికి నిధులు మంజూరు చేయించాలని యువ క్రీడాకారులు ఆకాంక్షిస్తున్నారు. విశ్రాంత పి.డి. ఆదిరెడ్డి సత్యనారాయణ చొరవతో ఈ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలు నిర్వహించినట్టు స్థానికులు గుర్తు చేసుకున్నారు. అదే వైభవం మళ్లీ రావాలని క్రీడాకారులు కోరుకుంటున్నారు.

హక్కులపై మహిళలకు అవగాహన కల్పించాలి : అదనపు ఎస్పీ



చిన్నారులతో అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళల రక్షణ, హక్కులు, స్వయం సంమృద్ధిపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఏలూరు అమీనాపేట పోలీస్ కల్యాణ మండపంలో విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో లింగ వివక్ష లేకుండా అగ్ర భాగాన నిలవాలని సూచించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మహిళలకు అందుబాటులో ఉన్న రక్షణ చర్యలు, సహాయ కార్యక్రమాలు వంటి వాటిపై వివరించారు. పోలీస్ సహాయం ఎప్పుడు కావాలన్న 112కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత, లైంగిక సమానత్వం, మహిళా భద్రత వంటి అంశాలపై చైతన్యం కలిగేలా నాటికలు, పాటలు, నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు అభినందించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : హితం కోరేవారే స్నేహితులని మిత్రుల జ్ఞాపకాల నీడలో సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. చనిపోయిన స్నేహితుల జ్ఞాపకార్థం ఫ్యూచర్ ఇండియా, స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ పోటీలు సీజన్ -2 ఫైనల్ విజేతగా కె.ఎం. కింగ్స్ జట్టు ట్రోఫీ సాధించింది. ఫిబ్రవరి 14వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫైనల్ పోటీలు ఆదివారం జరిగాయి. కె.ఎం. కింగ్స్ కొత్తపేట, జెర్సీ జట్ల మధ్య జరిగాయి. కె.ఎం. కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. బహుమతి ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే చంటి ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్ ట్రోఫీని విజేతకు అందించారు. విన్నర్స్‌కు రూ.20వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు ప్రైజ్‌మనీ అందజేశారు. ఇటీవల మృతి చెందిన ఫుట్‌బాల్ కోచ్ కాశీసుబ్బారావు పేరు మీద ఈ ప్రైజ్‌మనీ అందజేశారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు



అలంకరణలో శ్రీరాట్నాలమ్మ

పెదవేగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ,చావలి సాయి అమ్మవారికి లలితా సహ స్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలి పారు. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.లక్ష విరా ళం అందించారని ఆయన చెప్పారు. అమ్మవారి దర్శనా నికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్ కుమార్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పెదవేగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం చక్రాయగూడెం పంచాయతీ సీతారామపురంలో శ్రీగంగానమ్మ, శ్రీమహాలక్ష్మి, పోతురాజు బాబుగార్ల ఆలయ పునఃనిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. సీతారామపురం దగ్గర పోలవరం కుడికాలువ సమీపంలో ఏళ్ల తరబడి ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో గ్రామస్థులు నిశ్చయించుకుని, తదనుగుణంగా నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో ఈ ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని గ్రామస్థులు తెలిపారు.

గ్రంథ పఠనంపై అవగాహన

పెదవేగి, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : తరచుగా గ్రంథాలయానికి వెళ్తుంటే అది విజ్ఞానానికి బాట అవుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలో శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ గ్రంథపఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

సత్యనారాయణ అరెస్టు తగదు

ఏలూరు కార్పొరేషన్, మార్చి2(ఆంధ్రజ్యోతి) : ఎల్‌జీ పాలిమర్స్ పేలుడు సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.వి.సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సీపీఐ శ్రేణులు ఆందోళన చేపడితే కక్షకట్టి అరెస్టు చేయించి రిమాండ్‌కు తరలించడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు నాయకులను నేరస్థుల మాదిరిగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆయనను బేషరతుగా విడుదల చేయాలని కోరారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

టి.నరసాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : కోడి పందేలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. అప్పలరాజుగూడెం గ్రామ శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం పోలీసులు దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 2,100 నగదు, కోడిపుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ముస్లింల రంజాన్ ప్రార్థనలు

పోలవరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ తొలిరోజు సందర్భంగా ఆదివారం పోలవరం అహెలె సున్నత్ జమాతే మసీదు, పట్టిసీమ, గూటాల మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఇఫ్తార్ విందులో హిందూ సోదరులు సైతం పాల్గొన్నట్లు మసీదు కమిటీ అధ్యక్షులు ఎండీ యాసీన్ షరీఫ్ తెలిపారు.

బెల్లం వ్యాపారులకు సూచనలు

ఏలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీదారులకు వ్యాపారులు బెల్లం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు హెచ్చరించారు. ఆదివారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఉన్న కిరాణా, బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీదారులకు బెల్లం విక్రయించవద్దని అన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్



చిత్రపటం అందజేస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయాన్ని జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ విజయభారతి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అనంతరం ఆమెకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్య నారాయణ మూర్తి అందజేశారు.

దివ్యాంగులకు నిత్యావసరాల అందజేత



సరుకులు అందజేస్తున్న దాతలు

భీమడోలు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 66 మంది దివ్యాంగులకు నెల వారీ నిత్యావసర సరుకులను అందజేశారు. గ్రామపెద్ద నంబూరి సుబ్బరాజు, అనసూయమ్మ, హరనాథరాజులు ఈ సరుకులు పంపిణీ చేశారు. అలాగే చల్లా నరసింహమూర్తి జ్ఞాపకార్థం భోజనాలు ఏర్పాటు చేశారు. శ్రీవిఘ్నేశ్వర సేవా సంస్థ సభ్యుల కృషిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రామకృష్ణ, పి.శ్యామలరాజు, జి.శ్రీనివాసరావు, సోములు, రవి, గంగరాజు పాల్గొన్నారు.

వైభవంగా లూర్దుమాత ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

కామవరపుకోట, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట మండలం తడికలపూడి హైస్కూలు రోడ్డులోని గట్టుపై ఉన్న లూర్దుమాత పుణ్యక్షేత్రం వద్ద జరుగుతున్న ఉత్సవాలకు ఆదివారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ దోమతోటి నతానియేల్, సిస్టర్స్, ఉపదేశి మాస్టర్స్ ప్రార్థనలు నిర్వహించారు. కార్య క్రమాల్లో క్రైస్తవ అభిమానులతోపాటు మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, టీడీపీ నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మేరుగు సుందరరావు ఉన్నారు.

అలరించిన సంగీత ప్రదర్శన



సంగీతాన్ని ఆలపిస్తున్న చిన్నారులు

ఏలూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఎస్.పి.ఎస్ మ్యూజిక్ అకాడమి 23వ వార్షికోత్సవ వేడుకలు, సంగీత విద్వాన్, సయ్యద్ పాష్యా సాహెబ్ 105వ జయంతిని ఆదివారం సాయంత్రం వై.ఎం.హెచ్.ఏ. హాలు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.పి.ఎస్ మ్యూజిక్ అకాడమి విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.ఈ కార్యక్రమంలో మానవతా నాగేశ్వరరావు, హేలాపురి కళాకారుల సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, వై.అర్జునరావులు పాల్గొని వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంగీత వాయిద్యాలతో ఆలపించిన గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని అకాడమి డైరెక్టర్ ఎస్.పి.ఎస్ వాసు, వహిదావాసు పర్యవేక్షించారు.

ఆలయాల్లో వైభవంగా అన్న సమారాధనలు



అగ్రహారంలో అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కమిటీ

ఏలూరు కార్పొరేషన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఏలూరు అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో గత నెల 8న ప్రారంభమైన 93వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా స్వామివారికి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు కొట్టు మధు వెంకట్రావు, గాదంశెట్టి రమేష్ కుమార్, వేమా వెంకట సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు, వేమా రాము, చెన్నా వెంకట్రామయ్య మిత్రబృందం భక్తులకు తగు సేవలందించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. కళావేదికపై నీలి శార్వాణి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన సభికులను ఆకట్టుకుంది.

నారాయణపురంలో ముగిసిన ఉత్సవాలు

ఉంగుటూరు : నారాయణపురం శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం జాతీయ రహదారి పక్కన ఉన్న కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బొడ్డేపల్లి దుర్గా ప్రసాదు ఏర్పాట్లు చేశారు.

పెదవేగి పురాతన శివాలయంలో

పెదవేగి : పెదవేగిలోని పురాతన శివాలయంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెదవేగితో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, ఆలయ కమిటీ ఛైర్మన్ కొండపావులూరి శ్రీనివాసరావు, గ్రామ స్థులు తాతా సత్యనారాయణ, కంచెన మోహనరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకుడు తిప్పా బట్ల సుబ్రహ్మణ్య శర్మ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూటమితోనే సంక్షేమం : చిట్టిబోయిన



రామలింగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు సంక్షేమ ఫలాలు అందుతాయని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరావు అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో సర్పంచ్ గుబ్బల సత్యవేణి అధ్యక్షతన శెట్టిబలిజ సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి పొందిన రామలింగేశ్వర రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు దూసనబోయిన నారాయణమూర్తి, గుబ్బల సత్యనారాయణ,అనసూరి శ్రీనివాస్, గుబ్బల రాంబాబు,కోట వెంకట రమణ పాల్గొన్నారు.

బాలుడికి గాయాలు

కుక్కునూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు భద్రాచలం ప్రధాన రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కునూరు నుంచి కివ్వాక వెళ్తున్న కారు చెరువు గట్టుపై అదుపు తప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ పదేళ్ళ బాలుడు తీవ్రంగా గాయపడటంతో భద్రాచలం తరలించారు. అధికారులు ఇప్పటికైనా ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

లింగపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. యడవల్లి శివారులో పేకాటాడుతున్నట్టు సమాచారం అందడంతో ఆ శిబిరంపై దాడిచేసి నలుగురితో పాటు వారి నుంచి 5,100నగదు, రెండు ద్విచక్రవాహనాలు, స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

లింగపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రోడ్లపై కాకుండా చెత్త వాహనంలోనే చెత్త వెయ్యాలని మండల విస్తరణాధికారి జేఎం రత్నకుమార్ అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెంలో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త - పొడిచెత్త వేరువేరుగా ఉంచాలని చెత్తవాహనాల కార్మికులకు అందుబాటులో ఉంచాలన్నారు. రోడ్లపై వేయడం వల్ల వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తగరం హేమలత, పంచాయతీ కార్యదర్శి సుగుణరాజు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సురక్షితమైన నీరివ్వండి

కొవ్వలిలో ప్లాంటు మూసివేతపై ఆవేదన

గత పరిణామాలపై ప్రజల్లో ఆందోళన

చెరువును ఎండగడుతున్నామన్న అధికారులు



మురికిగా ఉన్న నీరు

దెందులూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : సురక్షితమైన తాగునీరు అందించాలని కొవ్వలి గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. ఐదేళ్లపాటు గత వైసీపీ పట్టించుకోకపోవడంతో చెరువులోని నీరు అధ్వానంగా తయారైందని వాపోయారు. వైసీపీ రాకముందు టీడీపీ ప్రభుత్వంలో దెందులూరు, అలుగులగూడెం, ఉప్పుగూడెం, సానిగూడెం, సత్యనారాయణపురం, కొమ్మిరేపల్లి, సీతంపేట, పోతునూరు, ఉండ్రాజవరం, కొవ్వలి, దోసపాడు గ్రామాలకు తాగునీరు సక్రమంగా అందేది. టీడీపీ హయాంలో నీటిని శుద్ధిచేసే మైక్రో ఫిల్టర్ బెడ్‌లను 2016లో మార్చారు. మరలా ఐదేళ్లకు అంటే 2021లో మార్చాల్సి ఉన్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. రైల్వే గేటు సమీపంలో అండర్ పాస్‌ల పనుల కారణంగా పోతునూరు, కొవ్వలి, దెందులూరు, దోసపాడు మినహా మిగిలిన గ్రామాలకు పైలెట్ ప్రాజెక్టు పనులు నిలుపుదల చేశారు. రైల్వే పనులు పూర్తయినా తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభించలేదు. నిలిపివేసిన ఆ పనులు పునరుద్ధరించాలని కొవ్వలి ప్రజలు కోరుతున్నారు. మండలంలో చల్లచింతలపూడి, జోగన్నపాలెం, పోతునూరు, దోసపాడు, ఉండ్రాజవరం, వీరభద్రపురం, అక్కిరెడ్డిగూడెం, కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల్లోని వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు వచ్చాయి.వీటికి మరమ్మతులు చేసి తాగు నీటి ఇబ్బందులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. 2020 డిసెంబరు 8న కొవ్వలిలో అంతుచిక్కని వ్యాధితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కలుషితమైన నీటి వల్లే అనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఎయిమ్స్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్స్ సహా ప్రఖ్యాత సంస్థలు పరిశోధనలు చేసి శుభ్రమైన నీటిని అందించాలని సూచించారు. బురద నీరు వస్తున్న కారణంగా ప్రస్తుతం ప్లాంటు పని చేయడం లేదు. దీనిపై గ్రామీణ తాగునీటి సరఫర విభాగం ఏఈ వర్మను వివరణ కోరగా కొవ్వలి మంచి నీటి చెరువు లోతుగా ఉండటంతో తాగు నీరు కలుషితమవుతోందని చెరువును ఎండగట్టి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



మూసివేసిన ప్లాంటు, బురదగా ఉన్న చెరువు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



దేవస్థానంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముదినేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు హోమ కార్యక్రమాలు జరిపారు. నాగ ప్రతిమలకు పూజలు జరిపి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దేవస్థానం ఆవరణలోని పుట్టలో పాలు పోసి, మహిళలు పాలు పొం గళ్లతో స్వామి వార్లకు నివేదన సమర్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగాశ్రీ దేవి ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించగా, ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ, అర్చకుడు రుద్రపాక బాలగంగాధర తిలక్ అభిషేకాలు, పుట్ట వద్ద పూజలు నిర్వహించారు.

ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన



చాట్రాయి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చనుబండ సెంటర్‌లోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిపారు. ఆలయ ధర్మకర్తలు జల్లేపల్లి సుబ్బారావు, పరమేశ్వరరావు, మురళీకృష్ణ దంపతులు పీటలపై కూర్చోగా వేద పండితులు మంత్రోచ్ఛరణలతో శంకుస్థాపన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆకట్టుకున్న బాలోత్సవ్

నూజివీడు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):నూజివీడు బాలోత్సవ్ కార్యక్రమాన్ని సారథి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. బాలోత్సవ్ ఆహ్వానసంఘం జీఎల్‌టీ కోటేశ్వరి, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎస్.వి ప్రసాద్, డీవైఈవో ఎం.సేవియ్యాలు ముఖ్య అతిథులుగా హాజరవ్వగా నూజివీడు నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 2వేలమంది విద్యార్థులు కార్యక్రమానికి హాజరు అయ్యారు. 36 అంశాల్లో సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలుగా కార్యక్రమాన్ని నిర్వహించగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వ్యాస రచన, డ్రాయింగ్, ఇంగ్లీష్ రెయిమ్స్, కథారచన, సోలోసాంగ్స్, కోలాటం, ముకాభినయం, క్విజ్, గ్రూప్ డ్యాన్స్ తదితర అంశాల్లో చిన్నారులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా పలు అంశాల్లో దాదాపు 280మంది చిన్నారులను ఎంపిక చేసి బహుమతి ప్రధానం నిర్వహించారు.

ఇరుక్కుపోయాం



ఇరుకు వంతెన

» ఇరుకు వంతెనపై సాధ్యం కాని రవాణా » నాలుగు గ్రామాల ప్రజల ఆవేదన
» అభివృద్ధిలోను వెనుకబడిపోయాం » రైతుల కష్టాలైతే చెప్పలేం

చాట్రాయి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంకొల్లు-చీపురుగూడెం గ్రామాల మధ్య తమ్మిలేరు ప్రాజెక్టు లింక్ చానల్‌పై ఇరుకు వంతెన వలన నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సుమారు 55 ఏళ్ల క్రితం తమ్మిలేరు-గోసెలవాగు బేసిన్‌లను కలపటానికి ఇనుప గడ్డర్లతో ఈ వంతెన నిర్మించారు. కేవలం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు మాత్రమే నడవటానికి తక్కువ వెడల్పుతో ఈ వంతెన నిర్మాణం జరిగింది. ఈ వంతెనపై నుంచి గౌరీనగర్, మర్రిబంధం, మంగోపేట, చీపురుగూడెం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే 5, 6 కిలో మీటర్లు నడిచి ఈ ఇరుకు వంతెన దాటి మంకొల్లు రావల్సి ఉంది. ఈ గ్రామాల్లోకి లారీలు వచ్చే అవకాశం లేకపోవటంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్లపై మంకొల్లు వరకు తెచ్చి లారీలకు లోడు చేయవల్సి వస్తున్నది. ఈ కారణం వలన తమ పంటలకు సరైన ధర రాక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు వంతెన వలన తమ గ్రామాలు ఇంకా వెనకబడి ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. గత 30 ఏళ్ళ నుంచి ఈ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు ఈ సమస్య గురించి ప్రజలు మొరపెట్టు కోగా, ఇరుకు వంతెన వెడల్పు చేయిస్తామని హామీలు ఇచ్చారు కానీ కార్య రూపం దాల్చలేదు. ఇటీవల గ్రామానికి వచ్చిన నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి స్థానిక నాయకులు ఈ సమస్యను తీసుకువెళ్ళగా అధికారులతో కలిసి ఇరుకు వంతెనను పరిశీలించారు. ఇరుకు వంతెనను వెడల్పు చేయటానికి అవకాశం లేదని అధికారులు చెప్పటంతో కొత్త వంతెనకు అంచనాలు తయారు చెయ్యాలని మంత్రి ఆదేశాంచారు. మంత్రి పార్థసారథి హయాంలో కొత్త వంతెన నిర్మాణం జరిగి తమ కష్టాలు తీరతాయని 4 గ్రామాల ప్రజలు కొండంత ఆశతో ఉన్నారు.

నిత్యం ఇబ్బందులే



ఇరుకు వంతెన వలన రెండు తరాల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా రైతుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. కొత్త వంతెన నిర్మిస్తామని మంత్రి పార్థసారథి హామీ ఇవ్వటంతో ఇక మా ఇబ్బందులు తొలిగినట్లేనని నమ్మకంతో ఉన్నాం.

- బొట్టు లక్ష్మణరావు, చీపురుగూడెం

వైభవంగా మేరీ మాత ఉత్సవాలు



కలిదిండి మేరీ మాత చర్చిలో ప్రార్థినలు చేస్తున్న విశ్వాసులు

కలిదిండి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మేరీ మాత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం చర్చి విచారణ కర్త బంటుమిల్లి యోహాన ఆధ్వర్యంలో దివ్య బలిపూజ, జపమాల నిర్వహించారు. విశ్వాసులు చర్చిలో ప్రార్థనలు చేశారు. ఆలయ ఆవరణలో కల్వరి కొండ వద్ద మొక్కుబడులు తీర్చుకున్నారు.

వాహనాల దారి మళ్లింపు

ఉత్సవాలు పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు కలిదిండి వైపు వచ్చే వాహనాల దారి మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడ వైపు నుంచి భీమవరం వైపు వెళ్లే లారీలు, బస్సులు, ట్రక్కులు ఇతర భారీ వాహనాలు కోరుకొల్లు నుంచి కైకలూరు మీదుగా భీమవరం వైపు వెళ్లాలన్నారు. బైకులు, ఆటోలు, కార్లు, ఇతర చిన్న వాహనాలు కలిదిండి బస్టాండ్ పక్క నుంచి కోట కలిదిండి మీదగా తటవర్తి టైల్స్ వద్ద మెయిన్ రోడ్డు ఎక్కాలన్నారు. భీమవరం వైపు నుంచి గుడివాడ వైపు వెళ్లే లారీలు, బస్సులు, ట్రక్కులు ఇతర భారీ వాహనాలు ఉప్పుటేరు వద్ద నుంచి సున్నంపూడి మీదగా కైకలూరు, గుడివాడ వైపు వెళ్లాలన్నారు. బైకులు, ఆటోలు, కార్లు ఇతర చిన్న వాహనాలు భోగేశ్వర స్వామి ఆర్చ్ వద్ద నుంచి ఇరిగేషన్ బంగ్లా మీదగా పెద్ద మసీదు, కాలువ గట్టు పేట కలిదిండి మల్లమ్మ హోటల్ వద్ద మెయిన్ రోడ్డు ఎక్కాలన్నారు.

కాలువలోకి దూసుకు వెళ్లిన రొయ్యల లారీ

కాళ్ళ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కాళ్ళలో ఆదివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకోవడం వల్ల రొయ్యలతో వెళ్తున్న కంటైనర్ లారీ ప్రమాదవశాత్తు రుద్రాయకోడు మురుగు కాలువలోకి దూసుకెళ్ళింది. స్థానిక రైతులు, గ్రామస్తులు వెంటనే క్రేన్ల సహాయంతో లారీని పైకి తీసుకువచ్చారు. కంటైనర్ సీజ్ చేసి ఉండటంతో రొయ్యలు లారీలోనే సురక్షితంగా ఉన్నా యని రైతులు చెప్పారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదన్నారు.



వడాలి విద్యార్థినికి జాతీయ స్థాయి అవార్డు

ముదినేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయిలో నిర్వహించిన స్పెల్ బి (స్పెల్లింగ్) పోటీల్లో ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెంది కాగిత సాయిపల్లవి తన ప్రతిభను కనబర్చి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఆ గ్రామానికి చెందిన కాగిత సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుసుమ దంప తుల కుమార్తె అయిన మూడేళ్ళ బాలిక సాయిపల్లవి ముదినేపల్లిలోని ఇండోసాక్షన్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో మూడో తరగతి చదువుతూ పాఠశాల, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి ఆదివారం హైదరాబాద్‌లో పైసంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి స్పెల్ బి పోటీల్లో కూడా ప్రథమ స్థానాన్ని పొందింది. దీంతో ఆ విద్యార్థినికి జాతీయ స్థాయి రేజింగ్ స్టార్ అవార్డును సంస్థ ప్రతినిధులు అందజేసి అభినందించారు.

మేనిఫెస్టోకు తగిన బడ్జెట్

ముదినేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గత ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ఉందని తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన వడాలిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి ఈ బడ్జెట్ అద్దం పట్టేలా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తూ సుమారు 52 వేల కోట్లు కేటాయించడం, నీటి పారుదల రంగానికి, విద్యా రంగానికి బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించి ఆయా రంగాలకు నూతన రూపాన్ని తీసుకువచ్చే విధంగా బడ్జెట్‌ను రూపొందించారని అన్నారు.

కోడిపుంజుల దొంగలు పట్టివేత

ముదినేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలోని సీతాలం చంద్రకుమార్‌కు చెందిన రెండు కోడి పుంజులను శనివారం అర్ధరాత్రి దాటాకా ఎత్తుకుపోతున్న ఇద్దరు దొంగలను గ్రామస్తులు పట్టుకున్నారు. నందివాడకు చెంది ప్రస్తుతం ముదినేపల్లిలో ఉంటున్న మోహన్ ప్రవీణ్, పట్టాభిరామ్ లు చంద్రకుమార్ ఇంటి ఆవరణలోకి ప్రవేశించి సుమారు రూ. 20 వేల విలువైన రెండు పుంజులను దొంగిలిస్తుండగా పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు వారిని వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు. కోడి పుంజులను కూడా స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే గ్రామస్తులు దొంగలను కట్టేసి దేహశుద్ధి చేశారు.



ముదినేపల్లి ప్రాంతంలో చేపల మార్కెట్ వద్ద గుమికూడిన జనం.. మార్కెట్‌లో రొయ్యలు, చిన్న సైజు చేపలు

చేపల మార్కెట్లు కళకళ

కొరమేను కేజీ ధర రూ.500... వేట మాంసం రూ.1000

ముదినేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చికెన్ అమ్మకాలు తగ్గటంతో చేపల మార్కెట్లు కళకళలాడుతున్నాయి. గత కొద్ది రోజులుగా ముదినేపల్లి ప్రాంతంలో పెరిగిన చేపలు, వేట మాంసం అమ్మకాలు ఆదివారం మరింత జోరందుకున్నాయి. చికెన్ షాపులు వెలవెలబోతుండగా, చేపలు, రొయ్యలతోపాటు ఇతరచిన్న రకాల చేపలకు డిమాండ్ పెరిగింది. ధరలు కూడ విపరీతంగా పెరిగాయి. కొరమేను, బొచ్చె రకం చేప ధరలు వినియోగదారులకు అందుబాటులోకి లేకుండాపోయాయి. పెడన, బందరు, గుడివాడ, బంటుమిల్లి ప్రాంతాల నుంచి కూడ చేపల కేజీ రూ.200 నుంచి రూ.300 వరకు ధర పలికిన కొరమేను రకం చేప ధర ఆదివారం మార్కెట్‌లో అమాంతంగా రూ.400 నుంచి రూ.500లకు పెరిగింది. ఇతర చిన్న సైజు చేపల ధరలు కేజీ ఒక్కింటికి రూ.50 నుంచి వందకు పెరిగింది. ఇక వేట మాంసం ధరలు ఆకాశన్నంటాయి. ఈ మాంసం కేజీ ధర వెయ్యికి చేరింది. దీంతో వేట మాంసం కొనగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. చికెన్ అమ్మకాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నా ఎక్కువ శాతం మంది చికెన్ వినియోగానికి ముందుకు రావటం లేదు. రొయ్యల ధరలు కూడ కేజీ ఒక్కింటికి రూ.350కి చేరింది. దీంతో మాంసాహారులు చిన్న సైజు చేపల కొనుగోళ్లకు మొగ్గు చూపారు.



పోతనపల్లిలో సారా అనర్థాలపై అవగాహన ర్యాలీ

సారా అనర్థాలపై అవగాహన ర్యాలీ

చాట్రాయి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సారా తాగడం వల్ల అనేక రోగాల బారిన పడి యుక్త వయస్సులోనే చనిపోతున్నారని, ఇంతటి ప్రమాదకరమైన సారా తయారీ, అమ్మకాలు మానుకొని, గౌరప్రదంమైన వృత్తులు చేపట్టాలని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని పోతనపల్లిలో ఆదివారం సారా అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా, తాగినా నేరమని, ఇటువంటి నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు.

500 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం

అనంతరం పోతనపల్లి పెద్ద తండాలో జరిపిన దాడిలో 500 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ చెప్పారు. నేర స్థలం నుంచి పారిపోయిన భరోతు బిక్షాలు, లావూరి కాంతమ్మలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్య ప్రాణులకు ఆలవాలం పాపికొండల అభయారణ్యం

నేడు ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం





పోలవరం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో ప్రతి ప్రాణికి తమ స్వేచ్ఛా ప్రపంచంలో నిర్భయంగా బతికే హక్కు ఉంది. కానీ మానవుడు తన తన స్వార్థం కోసం అడవులపై పడి వనాలను తగులబెట్టి, వన్యప్రాణులను వేటాడడం వంటి అకృత్యా లకు పాల్పడి జీవ వైవిధ్యం మనుగడకు ముప్పు తెస్తున్నాడు.అడవులు అంతరించి అడవుల్లో జీవించే వన్యప్రాణులు జనారణ్యాల లోకి వచ్చి మృత్యువు పాలవుతున్నాయి. ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా వన్య ప్రాణుల సంరక్షణ గురించి మన ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంచారం గురించి తెలుసుకుందాం. ఐక్యరాజ్య సమితి వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం ప్రతి ఏటా మార్చి 3 జరుపుకోవడానికి నిర్ణయించింది. అంతరించిపోతున్న అడవి జంతుజాలం, వృక్షజాలం జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకోవడమే గాక అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల సమీపాల్లో ఉన్న గ్రామాల్లో వేట వృత్తిగా జీవిచే గిరిజనులకు వన్యప్రాణుల సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పోలవరం నుండి జీలుగుమిల్లి వరకూ అక్కడి నుండి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వరకూ అరణ్యాలు విస్తరించి ఉన్నాయి. ఏలూరు జిల్లా కృష్ణా జిల్లాల పరిధిలో 673 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కొల్లేరు పక్షుల సంరక్షణ కేంద్రం ఉంది. తడికలపూడి అడవులు, నల్లజర్ల అడవుల్లో సైతం వన్యప్రాణుల కదలికలు ఉన్నాయి. పోలవరం నుంచి గోదావరి ఎగు వన నదీ పరివాహక ప్రాంతానికి ఇరువైపులా ఖమ్మం జిల్లా వరకూ అడవులు విస్తరించి ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు కోసం గిరిజన గ్రామాలను మైదాన ప్రాంతా లకు తరలించడంతో పాపికొండల అభయా రణ్యంలో వన్య ప్రాణుల సంచారం పెరిగింది. గతంలో కంటే పాపికొండల అభయారణ్యంలో వన్య ప్రాణుల సంతతి గణనీయంగా పెరిగిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పాపికొండల అభయారణ్యంలో గొర్రగేదెలు, నెమళ్ళు, జింకలు, చిరుతలు, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, కుందేళ్ళు, నక్కలు, మొసళ్ళు, పులులు,అడవిపందులు, పాములు ఇతర జంతుజాలం గతంలో కంటే పెరిగింది. మైదాన ప్రాంతాల నుంచి గొర్రెల కాపరులు పాపి కొండల అభయారణ్యాలలోకి తమ గొర్రెల మందలను మేపడానికి వెళ్లడం వల్ల, అడవులను తగులబెట్టడం, పాపికొండల టూరిజం బోట్లలో డీజే మైక్ సౌండ్‌లు వినియోగించడం వల్ల వాటి స్వేచ్ఛకు భంగం కలిగి ప్రాణభయంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. గతంలో అడవుల నుండి తప్పిపోయి వచ్చిన గొర్రగేదె దాడిలో పోలవరం మండలం ఎల్లండీపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు మృతి చెందింది. ఈ వేసవిలో నీటి కోసం వచ్చే వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతాల్లో పలుచోట్ల నీటి కుంటలు, చెక్‌డ్యాంలలో నీటి నిల్వలు ఉంచడం ద్వారా వన్యప్రాణులు నీటి కోసం జనావా సాల్లోకి వచ్చే అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలి.

రాజమహేంద్రవరంలో ప్రధాన కేంద్రం

అటవీక్షేత్రాధికారి ఎస్‌కె వలీ, పోలవరం

పాపికొండల అభయారణ్యం పోలవరం రేంజ్ 9 వేల హెక్టార్లలో విస్తీర్ణంలో విస్తరించి ఉంది. తూర్పు గోదావరి జిల్లా, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రంపచోడవరం, కుక్కునూరు వేలేరుపాడు మండలాల పరిధిలో ఉన్న అరణ్యాలను 7 రేంజ్‌లుగా విభజించారు. 7 రేంజ్‌లను కలిపి రాజమహేంద్రవరంలో ప్రధాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడు రేంజ్‌ల పరిధిలో వన్యప్రాణులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ఆ కేంద్రం ద్వారా వన్యప్రాణులకు వైద్యసేవలు, సంరక్షణ, సంతతి అభివృద్ధి కార్యక్రమాలు అందించబడతాయి.



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్

నూజివీడు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మహిళలు, చిన్నారుల రక్షణ, వారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని విధులు, మహిళా సహాయ కేంద్రం పట్ల అవగాహన, పోలీసు ల పనితీరు, వారు వాడే పరికరాలు తదితర అంశాల పై విద్యార్థినీ విద్యార్థులకు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిం చారు. ఎస్సై జ్యోతిబసు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475



ఏలూరు రేంజ్‌కు 100 మంది ఎస్‌ఐలు

నియామక ఉత్తర్వులు అందజేసిన ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ బాధితులకు న్యాయం చేయాలని, ముద్దాయి లకు శిక్ష పడేలా పనిచేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వంద మంది 2024 బ్యాచ్ ఎస్‌ఐలు ఏలూరు రేంజ్‌నకు వచ్చారు. వీరిలో 68 మంది పురుషులు, 32 మంది మహిళలు ఉన్నారు. వీరికి ఏలూరు ఐజీ కార్యాల యంలో ఎస్‌ఐ నియామక ఉత్తర్వులను అందించారు. ఐజీ మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ పోలీస్‌శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచిం చారు. ఏలూరు రేంజ్ పరిధిలో అల్లూరి సీతారామ రాజు జిల్లాకు నలుగురు, కాకినాడ జిల్లాకు ఇద్దరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఒకరు, తూర్పు గోదావరి జిల్లాకు 15, పశ్చిమ గోదావరి జిల్లాకు ఒకరు, ఏలూరు జిల్లాకు ఒకరు, కృష్ణాజిల్లాకు 20 మంది, ఎన్టీఆర్ జిల్లా 56 మందిని ఆయా జిల్లాలకు కేటాయిస్తూ నియామకపు ఉత్తర్వులను అందించి అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు



మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు.

నూజివీడు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణపోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ ప్రారంభించగా, మహిళా పోలీస్‌సిబ్బందితో పాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళలకు మధుమేహ, రక్తపోటు, గైనకాలజీ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించారు.

ఆటోబోల్తా: డ్రైవర్ మృతి



ఆగిరిపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అమ్మవారిగూడెం వద్ద ఆటో బోల్తాపడి యువకుడు మృతిచెందాడు. ఆగిరిపల్లికి చెందిన కూరపాటి నాని (31) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆగిరిపల్లి నుంచి బండారుగూడెంకి ఆటోలో గోనె సంచులు లోడుతో వెళుతుండగా అమ్మవారిగూడెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నానికి తలకి బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. యువకుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.